## మంచి వార్త

# చెరువుల పునరుద్ధరణకు దృఢ సంకల్పం



**కొన్నేండ్ల** కింద కర్ణాటక రాష్ట్రం గదగ్ జిల్లాలోని బెలహోద, మాడగనూర్ గ్రామాల్లోని రెండు చెరువులు ఎండిపోయాయి. దాంతో ఈ ప్రాంతంలో నీటికి కటకట ఏర్పడింది. ఇది అక్కడి ప్రజలను చెరువుల పునరుద్ధరణ గురించి ఆలోచించేలా చేసింది. స్థానిక పాలనా యంత్రాంగానికి తమ పరిస్థితిని వివరించినప్పటికీ ఫలితం లేకపోయింది. కాలక్రమంలో చెరువు భూమిలో ముండ్లపొదలు మొలుచుకొచ్చాయి. మలవిసర్జనకూ వాడుకోవడం మొదలుపెట్టారు. దీంతో ఓ రకమైన దుర్వాసన వెలువడటమూ ప్రారంభమైంది. అలా నెమ్మదిగా ఈ ఊళ్ల ప్రజలు నీటి ఎద్దడికి లోనయ్యారు. తాగడానికి, సేద్యానికి, పశువులకు గుక్కెడు నీళ్లు లేని పరిస్థితి దాపురించింది. ఇది వారిని తమ చెరువులను ఎలాగైనా మరమ్మతు చేసుకోవడానికి బలమైన సంకల్పం చెప్పుకొనేలా చేసింది. ఈ క్రమంలో సంకల్ప గ్రామీణాభివృద్ధి సంస్థ తమ జిల్లాలోనే ముందర్గి తాలూకాలో కొన్ని చెరువులను బాగు చేసిందన్న విషయం తెలిసింది. దీంతో బెలహోద, మాడగనూర్ గ్రామాల ప్రజలు కూడా సంకల్ప సంస్థను సంప్రదించారు. తమ గోడు వెళ్లబోసుకున్నారు. అలా తమ చెరువుల పునరుద్ధరణకు ఆ సంస్థను ఒప్పించారు. మొదటగా నాలుగు ఎకరాల విస్తీర్ణం ఉన్న బెలహోద చెరువులో మరమ్మతు పనులు మొదలయ్యాయి. ఈ క్రతువులో సంకల్పతోపాటు గ్రామస్తులు కూడా తలా ఓ చేయివేశారు. బుల్‌డోజర్లతో ముండ్లపొదలను పెకలించారు. పూడిక తీశారు. దాన్ని రవాణా చేయడానికి తమ ట్రాక్టర్లను వాడుకున్నారు. ఫిబ్రవరి నెలలో బెలహోద చెరువు మరమ్మతు పూర్తయిపోయింది. ఇప్పుడు మాడగనూర్‌లో పని మొదలైంది. ''నీటి కొరత ఉన్నప్పుడు స్థానిక పాలనా యంత్రాంగం తాగునీటిని సరఫరా చేసింది. పశువుల కోసమైతే కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వచ్చింది. ఎండకాలమైతే ఆ బాధ చెప్పనలవి కాదు'' అని గ్రామస్తులు చెబుతారు. ఈ వర్షాకాలం నుంచి తమకు నీటి కష్టాలు ఉండవని ఆశిస్తున్నారు. చెరువుల మరమ్మతుకు స్థానికులకు అండగా నిలిచిన సంకల్ప గ్రామీణాభివృద్ధి సంస్థ చొరవ ప్రశంసనీయం.

## వైతాళికుల వాణి

గాలి, నీరు... ఈ రెండు ప్రవాహాల పైనే మొత్తం జీవం ఆధారపడి ఉంది. కానీ ఇప్పుడివి ప్రపంచపు చెత్తను మోసేవిగా మారిపోయాయి.

• **జాక్స్ యూవ్స్ కూస్టో**
(ఫ్రాన్స్ నావికాదళ అధికారి, ఓషనోగ్రాఫర్, రచయిత)

## క్యా సీన్ హై!

